# ఎవరు బాధ్యులు?

శ్రీ కాశీనాథుని నాగభూషణరావుగారు

ఏమండీ! మిమ్మల్నే! నేను యెంత చెవున ఇల్లు గట్టుకొని పోరుతూవున్నా మీకు నా మాట బొత్తిగా చెవున పడకుండా వచ్చింది. సరళ పెద్ద మనిషై నాలుగేళ్ళైంది. బ్రాహ్మణులమైకూడా యిన్నాళ్ళు యెదిగినపిల్లను యింట్లో బెట్టుకు కూర్చుంటే లోకులు యేమని పోతారు? అని అన్నది కావమ్మ తనభర్త రామేశంతో.

రామేశంగారికి పిత్రార్జితమైన ఆస్తి యేమీ లేదు. వాళ్ల పల్లెటూరులో వున్న స్కూల్‌లో ఒక ఉపాధ్యాయుడుగా పని చేస్తూవున్నాడు. ఆరుగురు పిల్లలు, భార్యా, భర్తా......ఇంతమందికి జీవనోపాదికి తన స్కూల్ మేష్టరు పనిలో వచ్చే పదనిమిది రూపాయలు తప్ప ఇతర ఆసరా యేమీలేదు. కావమ్మ వంటిమీద యేవన్నా సొమ్ములుంటే అమ్మేసన్నా యీ పెళ్ళి కాస్తా జేస్తామనుకొంటే, కావమ్మగారికి పుట్టింటివారు పెట్టిన తాలూకు రెండుజతల బంగారుగాజులు తప్ప యేమీ లేవు. రామేశానికి యేం చెయ్యటానికి పాలుబొయ్యేదికాదు. పోనీ ఆ వున్న యిల్లన్నా అమ్మేసి యీ కార్యం చేసేద్దామనుకొంటే, ఆ యిల్లుకూడా పరాయివాళ్లది. వీళ్ళ బీదరికానికి జాలిపడి ప్రస్తుతం ఆ యింట్లో వుండనిచ్చారు. కావమ్మగారు కూతురిపెళ్ళి ప్రసంగం యెత్తినప్పుడల్లా రామేశంగారికి నెత్తిన పిడుగు పడ్డట్టుగా వుండేది. కావమ్మగారి చేతికివున్న రెండు జతలగాజులు అమ్మేస్తే యెంత గొప్పగా వచ్చినా ఒకవందరూపాయలు వస్తే యెక్కువ. యేదోవిధంగా లేనివాళ్ళలాగ ఒక్కరోజు పెళ్ళి, నిరాడంబరంగా చేసుకున్నా ఆ వందరూపాయలు ఖర్చుకు చాలేటప్పటికి కష్టం. ఖర్చుకు ఎట్లాగో సరిపెట్టుకోవచ్చులే అనుకొని సంబంధాలకోసం వెతక మొదలుబెట్టాడు. సరళకు అప్పుడే పదహారో యేడొచ్చింది. సరళ వయస్సుకు తగిన యీడుగల పిల్లవాడు యెక్కడ దొరకలా! శారదాబిల్లు వచ్చిందన్న మాటేగాని బాల్య వివాహాలు యెక్కడ ఆగినై? యే నైజాం యిలాకా గ్రామాలకో పోయి యెవరికి వాళ్ళు రహస్యంగా బాల్యవివాహాలు చేసేస్తూవుంటే, పాపం రామేశంగారికి యెదిగిన పిల్లవాడు కావాలంటే యెక్కడ దొరుకుతాడు? యెక్కడన్నా తగిన సంబంధంవున్నా యెవరికి వాళ్లు వందలూ......వేలూ......కట్నాలు గుంజాలనేవాళ్ళే. పొట్ట గడవటమే కష్టంగా వుంటే కట్నాలు యెక్కడ తెచ్చియిస్తాడు! రోజుకు రోజుకు యింట్లో కావమ్మగారి పోరు జాస్తి అవుతున్నది. మొగవాడు తేగల స్థితిలో వున్నా లేకపోయినా ఆడవాళ్ళకు అయాసమయాలకు అన్నీ సరిగ్గా సమకూరాలంటారు. అంతేకాని మొగవాళ్ళ సాధకబాధకాలతో ఆడవాళ్ళకేమీ జోక్యంవుండదు.

రామేశంగారికి సరళ పెళ్లి యెట్లాచెయ్యటమా అనే దిగులు ఎక్కువైంది. అప్పిచ్చేవాళ్ళైనా వున్నవాళ్ళకే యిస్తారు కాని లేనివాళ్లకెవరిస్తారు? రోజుకు రోజుకు మనోవ్యాధివల్ల రామేశంగారు కృశించిపోతున్నాడు. తినేతిండి వంటబట్టక బలహీనం యెక్కువైపోయింది. ఆఖరుకు మంచం ఎక్కాడు. ఆవూళ్ళో ప్రసిద్ధికెక్కిన నాటువైద్యుడు రోజూ వచ్చి చెయ్యిచూచి ఎర్రమాత్రలు. నల్లమాత్రలు యేవేవో మందులు యిస్తున్నాడు. రోగాలకైతే మందులు కాని మనోవ్యాధికి మందులేమి పనికొస్తయి?

జబ్బుయేమీ తిరుగు ముఖంలో లేదు. కావమ్మగారు కూడా భర్తరోగంవల్లం వేళకు తిండి నిద్రలేక చిక్కి శల్యమైపోతున్నది.

రానురాను రామేశంగారు పగలూరాత్రిళ్లుకూడా 'నాకు కట్నాలకు ఎట్లా డబ్బుపుడుతుంది! నేను సరళపెళ్లి యెట్లాచేసేది!' అని ఒకటే పలవరించటం మొదలుబెట్టాడు.

సరళ యిన్నాళ్లు తనతండ్రికి యేదో మామూలుగానే జబ్బుచేసిందనుకొంటున్నది. కాని యీపలవరింతలమూలాన తన తండ్రికివచ్చిన రోగానికి కారణం తానేనని గ్రహించింది. తనకు పెళ్లి చేయలేకపోయినందుకేగదా తనతండ్రి మనోవ్యాధిచేతమంచంపట్టాడు; తల్లికూడా యీదిగులుచేతనే కృసించిపోతూవుంది. తన తల్లితండ్రులకు కలిగిన దుఃఖానికి కారణము తానే అని గ్రహించినప్పటినుంచి సరళకు చాలా కష్టంగా వుంది. ప్రపంచంఅంతా కట్నాలకోసం ఆడపిల్ల తల్లితండ్రులను పీడించటం చాలా అసహ్యం అనిపించింది. వున్నవాళ్లయితే యిస్తారు కాని లేనివాళ్లను పీడిస్తే యేమిలాభం? ఎట్లాగైనా తనతల్లితండ్రులను యీ చిక్కులోనుండి తప్పించాలనుకొంది.

తండ్రి మంచంవద్ద తనతల్లికూడా కూర్చునివుంది. సరళ మెల్లగా తండ్రి మంచందగ్గరకుపోయి నిలుచుండి తన తల్లితండ్రుల స్థితిచూడగానే చాలాదుఃఖం కలిగింది. వీరిని యెట్లా యీసంకటంలోనుండి తప్పించటమా అని ఆలోచిస్తూవున్నది. మనస్సులో యేమి ఆలోచన తట్టిందోగాని సరళ ముఖానవున్నట్టేవుండి సంతోషం కనబడుతున్నది.

"నాన్నా! నాన్నా!" అని పిలిచింది. రామేశం కళ్లుతెరచి వింటూవున్నాడు... "నాన్నా! నీవు నా పెళ్లినిగురించి దిగులుపడొద్దు. దానివేళవస్తే క్షణంలో అదే అయిపోతుంది. నావిషయంలో మీరుమాత్రం దిగులుపడకుండా వుండండి.'' అని చరచర దొడ్లోకి పోయింది. మరుక్షణమే భావిలో యేదోపడ్డట్టు పెద్ద చప్పుడయింది. అర్ధగంటసేపట్లో వారూవీరూఅంతా చేరి భావిలోంచి సరళశవాన్ని బయటకులాగి పడేశారు. అభముశుభముఎరగని సరళ చావుకు యెవరు బాధ్యులు?

## భాగ్యరేఖ

శ్రీమతి కో. లీలావతిగారు

పెంచితి గులాబి నెంతయుఁ బ్రేమతోడ
ముద్దులొలికెడి మధురంపుఁ బూలుపూచె
నాగులాబినిఁ జూచి నా యంతరాత్మ
మురిసిపోయె సంతసములో మునిగిపోయె.

ముడిచి తొక మోహానసుమము ముద్దుకృష్ణు
నకయయోజార విడచితి నొక సుమంబు
బురదలో బలిమినిలాగి పొగరుచేత
కాలద్రొక్కి నొండొక పూవు కన్నెయొకతె

భళిర ! యొకచెట్టు పూలకే భాగ్యరేఖ
ల స్తమించుట యుదయించు టరయనెంతొ
వింత యనుచును దెలియనే వేడ్కపడితి
తెలియజాలక నే నంత తెల్లపోతి.